క్లుప్తంగా

స్వయం ఉపాధికి ఊతం



మహిళకు కుట్టు మెషీన్ అందజేస్తున్న అలయన్స్ క్లబ్ సభ్యులు

బోట్‌క్లబ్: అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ద్వారా పలువురి స్వయం ఉపాధికి ఊతం అందిస్తున్నట్లు క్లబ్ మాజీ అధ్యక్షుడు పాలపర్తి సుబ్బారావు తెలిపారు. స్థానిక కాస్మోపాలిటన్ క్లబ్‌లో సోమవారం నిర్వహించిన సేవా కార్యక్రమాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్లబ్ సౌత్ ఇండియా మల్టిపుల్ వైస్ చైర్మన్ డాక్టర్ సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి సౌజన్యంతో మహిళలకు కుట్టు మెషీన్లను పంపిణీ చేశారు. అలయన్స్ క్లబ్ గవర్నర్ వింజరపు జనార్దనం మాట్లాడుతూ మరిన్ని వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ గవర్నర్ ఎం.వరాహ నరసింహమూర్తి, పీఆర్వో గన్ని గోపాలకృష్ణ, ఆకేటి గోపాలకృష్ణ, అద్దేపల్లి ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఆర్థిక సాయం



విద్యార్థినులకు సాయం అందజేస్తున్న డాక్టర్ రామకృష్ణ, దాతలు సతీష్, ప్రశాంతి దంపతులు

కాకినాడ రూరల్: స్థానిక భానుగుడి వద్ద అంబికా అక్వేరియం రెస్టారెంట్ యాజమాన్యం సేవా కార్యక్రమాల్లో భాగంగా ఇద్దరు పేద విద్యార్థినులకు రూ.20 వేల చొప్పున సాయం చేశారు. వాటిని ట్రస్ట్ ఆస్పత్రి డైరెక్టర్ రామకృష్ణ చేతుల మీదుగా సోమవారం పంపిణీ చేశారు. ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని మానస, బీఎస్సీ నర్సింగ్ మూడో సంవత్సరం చదువుతున్న మహిమ ఆర్థిక సాయం అందుకున్నారు. దాతలు కోన సతీష్, ప్రశాంతి దంపతులు పాల్గొన్నారు.

జాతీయ మహాసభ విజయవంతానికి పిలుపు



జాతీయ మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీసీ నాయకులు

కాకినాడ సిటీ: బీసీ సంక్షేమ సంఘ జాతీయ మహాసభ ఈ నెల 17న విజయవాడలో జరుగుతుందని, దీనిని విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుండల సాయికుమార్ యాదవ్ స్వగృహంలో గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు యాదవ్ ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని, కేంద్రంలో ఓబీసీ మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని, మండల కమిషన్ సిఫార్సులను పూర్తి స్థాయిలో అమలు చేయాలని వంటి అంశాలపై ప్రధానంగా చర్చిస్తారన్నారు. బీసీ సంక్షేమ సంఘ నాయకులు వియ్యపు అప్పల స్వామి, పంచకట్ల రామకృష్ణ, మరుకుర్తి వీర గంగాధర్, చీపురుపల్లి రాఘవ తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య

సామర్లకోట: బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య అన్నారు. స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో బాలల సంక్షేమం, పరిరక్షణ కమిటీ అధికారులకు మండల స్థాయిలో మిషన్ వాత్సల పథకంపై సోమవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బాల్య వివాహాలు అరికట్టడం అందరి బాధ్యత అని అన్నారు. 18 ఏళ్లలోపు వారికి వివాహ సర్టిఫికెట్లు జారీ చేస్తే సదరు ఉద్యోగులపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే 1098కు సమాచారం అందించాలన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణ మాట్లాడుతూ బాల్య వివాహాలు సామాజిక రుగ్మతగా భావించాలన్నారు. పెద్దాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి జి.ఉషా మాట్లాడుతూ బాలల చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవడానికి నిర్వహిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చైల్డ్ హెల్ప్‌లైన్ అధికారి బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పోక్సో చట్టం గురించి వివరించారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. సీఐ ఎ.కృష్ణభగవాన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఉమాదేవి, ఎండీ సుల్తాన్ బీబీ, క్లాప్ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ లక్ష్మి, వార్డు అడ్మిన్లు, రెవెన్యూ అధికారులు, ఏఎన్‌ఎంలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

తొలకరి... ఉక్కిరిబిక్కిరి

- ఆదిలోనే ఎండలతో ఇబ్బందులు
- నీరందక ఎండుతున్న నారుమడులు
- కాలువల్లో నీటిని తోడేందుకు రైతుల అవస్థలు



కాకినాడ రూరల్ తిమ్మాపురంలో ఖరీఫ్ సాగు కోసం వేసిన నారుమడి

కాకినాడ రూరల్: రానురాను సాగు భారం అవుతోంది.. దేశానికి అన్నం పెట్టే రైతన్న ముందుకు సాగడం కష్టంగా మారుతోంది. మొన్నటి వరకూ రబీ ధాన్యం సొమ్ము అందక అన్నదాతలు ఇబ్బంది పడ్డారు. చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక అవస్థలు ఎదుర్కొన్నారు. ఇటీవల చినుకులు పలకరించడంతో తొలకరి సాగుకు ముందుకు వెళ్లారు. ఆదిలో హంసపాదు అన్నట్టు సీజన్ ప్రారంభంలోనే వరుణుడు వెనక్కి తగ్గడంతో భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. పగటి ఉష్ణోగ్రతలు 34 డిగ్రీల సెల్సియస్ వరకూ నమోదవుతుండడంతో నారు మడులకు గండంగా మారింది. మరోవైపు సాగు నీరు సక్రమంగా అందక నీటి ఎద్దడితో రైతులు తమ నారును కాపాడుకునేందుకు దూరంగా ఉన్న కాలువల నుంచి నీటిని తోడుకునేందుకు ఎంతో వ్యయ ప్రయాసలకు గురవుతున్నారు. కాకినాడ రూరల్ మండలంలో సుమారు 4200 ఎకరాల్లో రైతులు ఏటా వరి పండిస్తున్నారు. మండలంలోని చీడిగ, కొవ్వూరు, కొవ్వాడ, రేపూరు, గంగనాపల్లి, తూరంగి గ్రామాల ఆయకట్టుకు గోదావరి జలాలు, మిగిలిన తిమ్మాపురం, సర్పవరం, పండూరు, పి.తిమ్మాపురం, నేమాం, తమ్మవరం, పెనుమర్తి తదితర గ్రామాల ఆయకట్టుకు ఏలేరు ద్వారా నీరు అందాలి. గోదావరి జలాలు ముందుగానే విడుదల చేయడంతో ఆయా గ్రామాల్లో రైతులు సాగు ప్రారంభించగా, నీరు మాత్రం సక్రమంగా అందడం లేదు. ఏలేరు నుంచి ఆలస్యంగా ఈ నెల 7న నీరు విడుదల చేయగా కాకినాడ రూరల్ మండలంలోని ఆయకట్టు శివారుగా ఉండడంతో ఇప్పటికి సాగునీరు సక్రమంగా అందడం లేదు. దీనివల్ల తిమ్మాపురం, పండూరు తదితర గ్రామాల్లో నారు ఎండిపోతుంది. మరోవైపు వర్షాలు లేక వెదజల్లు పద్ధతిలో సాగు చేపట్టేందుకు ఎదురు చూస్తున్న రైతులు నిరాశగా ఉన్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో ఎక్కువగా రైతులు స్వర్ణ, బీపీటీ, సాధన వంటి సన్నరకాల వైపు మొగ్గు చూపుతున్నారు.

అందని పెట్టుబడి సాయం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏటా మే నెలలోనే రైతు భరోసా పేరిట రైతులకు పెట్టుబడి సాయంగా రూ.13,500 అందించేవారు. కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పేరిట పెట్టుబడి సాయం రూ.20 వేలు అందిస్తామని ప్రకటించింది. పీఎం కిసాన్ నిధులతో కలిపి నేటికీ సొమ్ము జమ చేయలేదు. ఖరీఫ్ సాగు చేపట్టే రైతన్నలు నారుమడులకు విత్తనాలు, దుక్కులు, మందులు, దమ్ములకు ఎక్కువగా పెట్టుబడి పెట్టాల్సి వస్తుంది. గతంలో మే నెలలోనే సాయం అందడంతో రైతులు ఎంతో సంతోషంగా ఉండేవారు. ఇప్పుడు రెండు నెలలు ఆలస్యమవ్వడంతో ఆశగా ఎదురు చూస్తున్నారు.

నీటి ఎద్దడితో అవస్థలు



నీటి ఎద్దడి ఎక్కువగా ఉంది. నారుమడులు ఎండిపోతున్నాయి. ఏలేరు నీరు పూర్తిగా రావడం లేదు. కాలువ వద్ద నుంచి నీరు తోడుకుని నారు కాపాడుకుంటున్నాం. ఎండలు ఎక్కువగా ఉన్నాయి. ఖరీఫ్ సాగు ఎలా ఉంటుందనే భయం నెలకొంది. ఐదు ఎకరాలు సొంత పొలంతో పాటు 20 ఎకరాలు కౌలు పొలం సాగు చేపట్టాను. ప్రభుత్వం నుంచి రబీ డబ్బులు ఇటీవలే వచ్చాయి. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే సీఎంఆర్ ద్వారా జమ చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాం.

–పెదపూడి నాగవెంకట సత్యనారాయణ, రైతు, తిమ్మాపురం

అందుబాటులో విత్తనాలు



ఖరీఫ్ సాగును రైతులు ఇప్పుడిప్పుడే ప్రారంభించారు. గోదావరి జలాలు అందుతున్నాయి. ఏలేరు ఆయకట్టుకు తక్కువగా నీరు వస్తుంది. రైతులకు విత్తనాలు అందుబాటులో ఉంచాం. రైతు సేవా కేంద్రాలతో పాటు బయట షాపుల్లో విత్తనాలు అందుబాటులో ఉండడంతో రైతులు ఇప్పటికే కొనుగోలు చేశారు. సిబ్బంది బదిలీల కారణంగా రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు ఇంకా అందుబాటులో ఉంచలేదు. త్వరలో రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు లభిస్తాయి. బయట దుకాణాల్లో ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి.

–చీకట్ల సత్యనారాయణ, వ్యవసాయాధికారి, కాకినాడ రూరల్

నేడు మిషన్ వాత్సల్య పథకంపై సమావేశం

కరప: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 'మిషన్ వాత్సల్య పథకం'పై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎం.అనుపమ తెలిపారు. పీసీఎంఏ చట్టం 2006, ఏపీ బాల్య వివాహ నిషేధ నియమాలు 2023 అమలును పర్యవేక్షించడానికి ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

గోళ్లమూడి మృతికి సంతాపం

కాకినాడ సిటీ: ఉపాధ్యాయుడిగా, ఉపాధ్యాయ ఉద్యమ నేతగా, జనవిజ్ఞాన వేదిక నాయకుడిగా, అక్షర గోదావరి ఉద్యమంలో క్రియాశీలంగా కృషి చేసిన క్రామేడ్ గోళ్లమూడి నాగేశ్వరరావు (84) సోమవారం కాకినాడలోని తన నివాసంలో మృతి చెందారు. సీపీఎం నాయకులు కరణం ప్రసాదరావు, దువ్వా శేషుబాబ్జీ, జి.బేబీరాణి, మోర్త రాజశేఖర్, సీహెచ్ రమణి, పలివెల వీరబాబు, కె.సత్తిరాజు, మలక వెంకటరమణ, నాగాబత్తుల సూర్యనారాయణ, టి.నాగేశ్వరరావు, టి.రాజా, సీహెచ్ అజయ్‌కుమార్, విజయ్‌కుమార్, పి.రామకృష్ణ తదితరులు గోళ్లమూడి నాగేశ్వరరావు భౌతికకాయం వద్ద పూల మాలలు వేసి నివాళులర్పించారు. వీరితో పాటు ప్రజా సంఘాల నాయకులు అయితాబత్తుల రామేశ్వరరావు, కె.వీరబాబు, మేడిశెట్టి వెంకటరమణ, వాసంశెట్టి చంద్రరావు, గుత్తుల రామకృష్ణ, వి.రవికుమార్, కృష్ణాజీ, సీహెచ్ ఉదయభాస్కర్ తదితరులు సంతాపం తెలిపారు.

విద్యార్థినులకు భద్రత కల్పించండి



కాకినాడ సఖి వన్‌స్టాప్ విజిటర్స్ రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న డాక్టర్ శైలజ

కాకినాడ క్రైం: స్థానిక జీజీహెచ్‌లో పారా మెడికల్ విద్యార్థినులపై లైంగిక వేధింపులు చోటుచేసుకోవడంతో రాష్ట్ర మహిళా కమిషన్ స్పందించింది. కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ సోమవారం కాకినాడ రంగరాయ వైద్య కళాశాల, జీజీహెచ్‌లను సందర్శించారు. విద్యార్థులు, బోధకులతో సమావేశమయ్యారు. జీజీహెచ్‌లో వన్‌స్టాప్ సెంటర్‌ను, మెడికల్ ల్యాబ్‌లు, ప్రసూతి వార్డులను పరిశీలించారు. అంతకు ముందు, ఆర్‌ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్ సహా ఇంటర్నల్ కంప్లెయింట్స్ కమిటీ (ఐసీసీ)తో సమావేశమయ్యారు. మూడు కీలక సూచనలు చేశారు. ఫిర్యాదు చేసిన విద్యార్థులకు భద్రత కల్పించాలన్నారు. ఐసీసీ కార్యకలాపాలు, శక్తి యాప్‌పై విద్యార్థినులకు అవగాహన విస్తృతం చేయాలని సూచించారు. శిక్షణకు వెళుతున్న విద్యార్థినులు పనిచేసే వార్డులు, ల్యాబ్‌లు, ఫార్మసీ యూనిట్లు, ఇతర ప్రాంతాల్లో సీసీ కెమేరాలతో సహా పర్యవేక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

వన్‌స్టాప్ సెంటర్ వెన్నెముక

మహిళల సమస్యలు తమ దృష్టికి తేవడంతో పాటు తక్షణ సాంత్వన కల్పించడంలో వన్‌స్టాప్ సెంటర్ మహిళా కమిషన్‌కు వెన్నెముకగా పనిచేస్తోందని శైలజ అన్నారు. ఆర్‌ఎంసీ నుంచి జీజీహెచ్‌కు వచ్చిన ఆమె సఖి వన్ స్టాప్ సెంటర్‌ను సందర్శించారు. అడ్మిన్ శైలజ సెంటర్ కార్యకలాపాలు, దీనార్థ మహిళలకు అందించిన భరోసా, భద్రతను వివరించారు. అనంతరం లైంగిక వేధింపులు చోటు చేసుకున్న వార్డులను పరిశీలించారు. గైనకాలజీ విభాగంలో ప్రసూతి, ఇతర సేవలను పర్యవేక్షించారు. జేసీ రాహుల్ మీనా, అదనపు ఎస్పీ దేవరాజ్ పాటిల్, ఆర్‌ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, డిప్యూటీ సూపరింటెండెంట్ శ్రీనివాసన్, ఆర్‌ఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు ఉమామహేశ్వరరావు, శశి, బయో కెమిస్ట్రీ అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజేంద్ర, డిప్యూటీ కలెక్టర్, జీజీహెచ్ అడ్మిన్ శ్రీధర్, ఐసీడీఎస్ పీడీ దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.

భూమికి రక్షణ కల్పించాలని వినతి

కాకినాడ సిటీ: సర్పవరం పరిధిలోని 1.37 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎస్సీ బర్మా బాధితుల కాందీశీకులకు ఇచ్చారని, దానిని కబ్జాదారుల నుంచి రక్షించాలని ప్రజా సంఘాల నాయకులు జేసీ రాహుల్ మీనాకు సోమవారం వినతి పత్రం అందించారు. కబ్జాదారుల చేతుల్లోకి పోతున్న భూమిని కాపాడి, దానిని భూమి లేని ఎస్సీలకు ఇవ్వాలని జేసీని కోరారు. కార్యక్రమంలో ఆంధ్ర మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధాంతుల కొండబాబు, జైభీమ్‌రావు భారత పార్టీ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల చైర్మన్ ఏనుగుపల్లి కృష్ణ, డీబీఎఫ్ జాతీయ కోఆర్డినేటర్ తోటి చంగలరావు, భీమ్ ఆర్మీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లి శివకుమార్, సీపీఐ న్యూడెమోక్రసీ నాయకులు గుబ్బల ఆదినారాయణ మూర్తి, దళిత నాయకుడు అడబాల గురునాథ్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుకు సాయం

కాకినాడ రూరల్: సర్పవరం ట్రస్ట్ ఆస్పత్రిలో కాలి సంబంధిత సమస్యతో చికిత్స పొందుతున్న వీడియో జర్నలిస్ట్ మల్లాడి సుమన్‌కు జిల్లా జర్నలిస్టుల వెల్ఫేర్ అసోసియేషన్ రూ.5 వేల సాయం చేసింది. అసోసియేషన్ సభ్యులు మంగా వెంకట శివరామకృష్ణ, గునిపే శోభన్‌బాబు, ముమ్మిడి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. ట్రస్ట్ ఆస్పత్రి తరపున డైరెక్టర్ రామకృష్ణ రూ.5 వేలు అందించారు.

కీచకులను కఠినంగా శిక్షించాలి



జేసీ రాహుల్ మీనాకు వినతి పత్రం అందజేస్తున్న సిద్ధూ తదితరులు

కాకినాడ సిటీ: స్థానిక రంగరాయ మెడికల్ కాలేజీలో పారా మెడికల్ విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన నలుగురు కీచకులను తక్షణమే శిక్షించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాకు ఆయన వినతి పత్రం అందజేశారు. అనంతరం కలెక్టరేట్‌లో విలేకర్లతో మాట్లాడారు. వైద్య కళాశాలలో బయో కెమిస్ట్రీ ల్యాబ్‌లో అటెండెంట్‌గా పని చేస్తున్న వాడ్రేవు కళ్యాణ్ చక్రవర్తి, బోడే జిమ్మీరాజు, సరిపల్లి గోపాలకృష్ణ, కొప్పిశెట్టి వీరవెంకట సత్యనారాయణలు కలసి విద్యార్థినులపై అసభ్యకరంగా ప్రవర్తించిన తీరు యావత్తు జాతి సిగ్గు పడాల్సిన విషయమన్నారు. ఇది విద్యా వ్యవస్థపై పడిన మచ్చ అని సిద్ధూ పేర్కొన్నారు. పాఠశాలల నుంచి కళాశాలల వరకూ విద్యార్థినులు భద్రత లేకుండా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. లైంగిక వేధింపులు, మానభంగాలు, హత్యలు రోజురోజుకూ పెరుగుతున్నా ప్రభుత్వం మౌనం వీడడం లేదని విమర్శించారు. బాధిత విద్యార్థినులకు న్యాయం జరగాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు తలెత్తకుండా చూడాలని కోరారు. తక్షణ చర్యలు తీసుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా భారీ ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా నాయకులు కె.నవీన్, కె.మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

భూమి ఆన్‌లైన్ చేయాలంటూ నిరసన



భూమిని ఆన్‌లైన్ చేయాలంటూ నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

కాకినాడ సిటీ: ప్రత్తిపాడు మండలం ఉద్దండ జగన్నాథపురంలో ఉన్న సుమారు 80 ఎకరాల భూమిని ఆన్‌లైన్ చేయాలంటూ ఆ భూమిని సాగు చేసుకుంటున్న రైతులు సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ భూమిని 70 మంది రైతులు 60 ఏళ్లుగా సాగు చేసుకుని జీవనోపాధి పొందుతున్నారని అన్నారు. గతంలో ఆన్‌లైన్‌లో ఉండేదని, ఏడాది కిందట రీసర్వేలో ఆన్‌లైన్‌లోని అడంగల్‌లో నమోదు కాలేదని రైతులు అన్నారు. ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లినా సమస్య పరిష్కారం అవ్వడం లేదన్నారు. ఈ సమస్య జిల్లా కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ పరిధిలో ఉంటుందని, ఆయనే సమస్యను పరిష్కరిస్తారని చెప్పడంతో కలెక్టరేట్‌కు వచ్చినట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో 1బీ అడంగల్‌లో నమోదు కాని కారణంగా తమకు వ్యవసాయం చేసుకునే నిమిత్తం రుణాలను బ్యాంకులు మంజూరు చేయడం లేదని రైతులు వాపోయారు. తమ సమస్యను తక్షణమే పరిష్కరించి అడంగల్ 1బీలో నమోదు చేయించాలని కోరారు. అనంతరం జేసీ రాహుల్ మీనాను కలసి వినతిపత్రం అందజేశారు.

నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా నిరసన



కేంద్ర కార్మిక సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న తోకల ప్రసాద్

కాకినాడ సిటీ: నాలుగు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా ఈ నెల 9న దేశవ్యాప్తంగా జరిగిన సమ్మెను విజయవంతం చేసిన కార్మిక వర్గానికి కేంద్ర కార్మిక సంఘాల నాయకులు అభినందనలు తెలిపారు. సోమవారం కాకినాడ కచేరిపేటలోని సీఐటీయూ కార్యాలయంలో సమావేశంలో పలువురు కేంద్ర కార్మిక సంఘాల నాయకులు మాట్లాడారు. నాలుగు లేబర్ కోడ్‌లు దేశంలో అమలు జరిగితే భద్రత కలిగిన ఉద్యోగులు సైతం అసంఘటిత రంగ కార్మికులుగా మారాల్సి వస్తుందన్నారు. సుమారు మూడు కోట్ల మంది గిగ్ వర్కర్లు, స్కీమ్ వర్కర్లు కార్మిక చట్టాల నుంచి తొలగించబడతారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమల్లో పని చేసే కార్మికులైతే బానిసల కంటే దారుణంగా శ్రమ దోపిడీకి గురవుతారన్నారు. బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలసీల పట్ల కార్మికులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సమావేశం హెచ్చరించింది. సమావేశంలో కేంద్ర కార్మిక సంఘాల నాయకులు తోకల ప్రసాద్, దువ్వా శేషుబాబ్జీ, చెక్కల రాజ్‌కుమార్, మలకా రమణ, తాళ్లూరి రాజు, గొడుగు సత్యనారాయణ, జె.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో ముందుండాలి



ప్రమాణ స్వీకారం చేసిన కాకినాడ రూరల్ లయన్స్ క్లబ్ సభ్యులు

కాకినాడ రూరల్: సేవా కార్యక్రమాల్లో లయన్స్ క్లబ్‌లు ముందుండాలని పూర్వ గవర్నర్లు బాదం బాలకృష్ణ, రమేష్, విశ్వేశ్వరరావు అన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో లయన్స్ క్లబ్ ఫంక్షన్ హాలులో సోమవారం కాకినాడ రూరల్ క్లబ్ లయన్స్‌ను వారు నూతనంగా ప్రారంభించారు. రూరల్ క్లబ్ అధ్యక్షుడిగా వైద్యుడు అడ్డాల సత్యనారాయణ, కార్యదర్శిగా వెంకటేశ్వరరావు, కోశాధికారిగా రంగనాయకులు ఎన్నికవ్వడంతో వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. త్వరలో లయన్స్ క్లబ్ గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేయనున్న లయన్ చిట్నీడి శ్రీనివాస్ మాట్లాడుతూ నూతన కార్యవర్గ అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ, సభ్యులు గ్రామాల్లో సేవా కార్యక్రమాల ద్వారా మంచి గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. లయన్ నిమ్మకాయల వెంకటేశ్వరరావు, తలారి రామచంద్రరావు, ప్రభుదాస్, మిరియాల రామచంద్రరావు, కామేశ్వరి, కంచుమర్తి శ్రీనివాస్, నాళం కేశవ్ పాల్గొన్నారు.

• తొలగించారు.. రోడ్డుపై పడేశారు



జీజీహెచ్ వద్ద రోడ్డుపై వదిలేసిన చెట్టు కొమ్మలు

బోట్‌క్లబ్: విద్యుత్ లైన్లకు అడ్డంగా ఉన్న చెట్టు కొమ్మలను ఆ శాఖ సిబ్బంది తొలగించి రోడ్డుపైనే పడేశారు. ఇది జరిగి నాలుగైదు రోజులు కావొస్తున్నా వాటిని ఎవరూ తీయకపోవడంతో ప్రస్తుతం ప్రయాణికులకు ఇబ్బంది తప్పడం లేదు. స్థానిక వార్ఫ్ రోడ్డులోని పలు ప్రాంతాలు, జీజీహెచ్ వద్ద చెట్టు కొమ్మలు రోడ్డు పక్కనే పడేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. నిత్యం వేలాది మంది ప్రయాణించే ఈ రద్దీ రహదారిలో ఈ చెట్టు కొమ్మలను తరలించకుండా రోజులు తరబడి అలాగే వదిలేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

రైతులను ముంచుతున్న 'కూటమి'



పాడా కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న వంగా గీతా విశ్వనాథ్

పిఠాపురం: కూటమి ప్రభుత్వం రైతులను నిండా ముంచుతుందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంగా గీతా విశ్వనాథ్ విమర్శించారు. నీరు అందక సాగు నిలిచిపోయిందని, కాలువ గట్లకు పడిన గండ్లను సక్రమంగా పూడ్చడం లేదని ఆమె వద్ద గొల్లప్రోలు, కొత్తపల్లి, పిఠాపురం మండలాలకు చెందిన పలువురు రైతులు వాపోయారు. దీంతో స్పందించిన ఆమె రైతులతో కలసి సోమవారం వివిధ రైతు సమస్యలపై పిఠాపురం పాడా కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గీత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత రబీలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు లేక తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారన్నారు. దీనిపై తాము రైతుల తరఫున పోరాటం చేస్తే గాని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదన్నారు. తీరా ధాన్యం కొనుగోలు చేసినా వాటికి సంబంధించిన సొమ్ము నెలలు గడుస్తున్నా వేయడం లేదన్నారు. దీంతో రైతు పెట్టుబడులు లేక అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఒకపక్క ఎరువులు, విత్తనాలు ప్రభుత్వం ద్వారా అందక రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఏలేరు, పీబీసీ కాలువలకు పడిన గండ్లు పూడ్చడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారన్నారు. ఇప్పటి వరకూ రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా సాయం అందించకపోవడం దారుణమన్నారు. కేంద్రం ఇచ్చిన వాటా కూడా ఇవ్వకుండా రైతులతో కూటమి ప్రభుత్వం ఆటలాడుతుందన్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌కు సాగునీటి ఎద్దడి వల్ల తీవ్ర ఆలస్యమైందన్నారు. సాగునీటి విషయంలో ప్రభుత్వం పట్టించుకోక జూలై వచ్చినా ఆకుమడులు పడలేదన్నారు. జూన్ 1వ తేదీనే సాగునీరు వదిలినట్టు చెప్పారని, కానీ జూలై వచ్చి 15 రోజులైనా ఇప్పటికి కనీసం నారుమడులకు కూడా నీరందలేదన్నారు. ఈ విషయమై నీటి పారుదల శాఖాధికారులు వెంటనే స్పందించి సాగునీరు వెంటనే అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ దృష్టి సారించాలని ఆమె కోరారు. గొల్లప్రోలు జెడ్పీటీసీ సభ్యుడు ఉలవకాయల నాగ లోవరాజు, అరిగెల రామయ్యదొర, దాసం వెంకటేష్, అధిక సంఖ్యలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో పూజలు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో స్వామివారికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారు జాము నుంచే స్వామివారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామివారి తొలి అభిషేకం తిలకించడానికి క్యూలో వేచి ఉన్నారు. ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభం వద్ద ఉన్న శివలింగానికి పాలు, ఆలయ పుష్కరిణిలో నీటితో స్వయంగా అభిషేకాలు చేసుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఉదయం పులిహోర ప్రసాదంగా, మధ్యాహ్న అన్నప్రసాదం, సాయంత్రం శెనగలు, పులిహోర ప్రసాదంగా ఏర్పాటు చేశారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అల్లాకి రాజగోపాల్‌శర్మ, సన్నిధిరాజు వెంకన్న, శ్రీకాకుళపు సత్యనారాయణ మూర్తి, వినయ్, చెరుకూరి రాంబాబులు పూజాదికాలు నిర్వహించారు. పూజల అనంతరం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేశారు. ఈ నెల 23న అమ్మవారికి శాకంబరిగా అలంకరణ ఉంటుందని చెప్పారు.

గెస్ట్ ఫ్యాకల్టీకి ఇంటర్వ్యూలు

బాలాజీచెరువు: స్థానిక పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 17న గెస్ట్ ఫ్యాకల్టీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కందుల ఆంజనేయులు సోమవారం తెలిపారు. కంప్యూటర్ సైన్స్ 2, బయో టెక్నాలజీ ఒక పోస్టుకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని, ఇతర వివరాలకు 96520 23082 నంబరులో సంప్రదించాలన్నారు.

వేళంగిలో..

కరప: వేళంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మ్యాథ్స్ గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎస్.వాణి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెస్సీ మాథ్స్‌లో 50 శాతం మార్కులతో అర్హత కలిగి ఉన్నవారు ఈ నెల 16వ తేదీ ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ప్రిన్సిపాల్ సూచించారు.